సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం। 5 । జూన్। 2023



నిప్పుల వాన..

భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. ఉదయం నుంచే ఎండ తీవ్రత కనిపిస్తోంది. దీంతో రోడ్లు నిర్మానుష్యమవుతున్నాయి. 8లో



లక్ష గొంతుల రణ నినాదమే..

ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా ఈనెల 11న ప్రజాగర్జన నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని తెలిపారు. 10లో

గరిష్టం / కనిష్టం
41° / 28°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఎండ తీవ్రత అధికంగానే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయంలో ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకుని వైభవంగా చండీహోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో స్వామివారి ఉత్సవ విగ్రహాలను యాగశాలకు తీసుకొచ్చారు. అక్కడ మండపారాధన, గణపతిపూజ నిర్వహించిన అనంతరం హోమం, పూర్ణాహుతి జరిపించారు. హోమంలో పాల్గొన్న 17 మంది భక్త దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రవికుమార్ శర్మ, నర్సింహమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు శ్రమదానం..

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

అమెరికా అబ్బాయి.. సత్తుపల్లి అమ్మాయి!



మ్యాథ్యూ, రాజ్యలక్ష్మి వివాహ వేడుక

సత్తుపల్లిటౌన్: ప్రేమ ఖండాంతరాలు దాటింది.. అమెరికా అబ్బాయితో సత్తుపల్లి అమ్మాయికి శనివారం రాత్రి సత్తుపల్లిలో వివాహం జరిగింది. సత్తుపల్లికి చెందిన పిల్లలమర్రి జానకీరాములు–పద్మావతి కుమార్తె రాజ్యలక్ష్మి యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఆమె పనిచేసే సంస్థలో సహోద్యోగి, మైకేల్ మిల్లర్, మిచెల్‌హిల్ కుమారుడు మ్యాథ్యూతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దీంతో ఇరువైపుల పెద్దలు అంగీకరించటంతో శనివారం రాత్రి సత్తుపల్లిలోని శ్రీలక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో వివాహం చేసుకున్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో 2కే రన్

ఖమ్మం సహకారనగర్: ఢిల్లీలో పోరాడుతున్న రెజ్లర్లకు మద్దతుగా ఖమ్మంలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యాన ఆదివారం 2కే రన్ నిర్వహించారు. సర్దార్ పటేల్ స్టేడియం నుండి జెడ్పీ సెంటర్ వరకు సాగిన రన్‌ను జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడుతూ మహిళా రెజ్లర్లను వేధించిన బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

మిగిలింది వారమే!



కొత్తగూడెంలోని బూడిదగడ్డ ప్రభుత్వ పాఠశాలలో నిర్మాణం పూర్తికాని డైనింగ్ హాల్

'మన ఊరు - మన బడి' పనుల్లో జాప్యం

- ఇప్పటివరకు ప్రారంభమైనవి మూడు.. పూర్తయినవి 40
- 325 పాఠశాలల్లో ఇంకా కొనసాగుతున్న పనులు
- 24 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు
- మరో ఎనిమిది రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపొందాలని, విద్యా ప్రమాణాలు కూడా అదే రీతిలో పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు – మన బడి పథకాన్ని అమలుచేస్తోంది. ఇందుకోసం తొలిదశలో జిల్లాలో 368 పాఠశాలలు ఎంపిక చేసి కొత్త భవనాల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న వాటిలో అవసరమైన మరమ్మతు పనులు చేపట్టారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. పనుల పురోగతిపై కలెక్టర్ సైతం ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారు. అయినా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం జరుగుతూనే ఉంది. పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన 24 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన కలెక్టర్.. ఆయా పాఠశాలల కాంట్రాక్టర్లను సైతం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు.



జిల్లాలో మన ఊరు – మన బడి పథకం కింద తొలిదశలో 368 పాఠశాలలు ఎంపిక చేశారు. వాటిలో ఇప్పటివరకు మూడు పాఠశాలలు మాత్రమే ప్రారంభం కాగా, మరో 40 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన 325 పాఠశాలల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం మరో వారం రోజుల్లో ప్రారంభం కానుండగా పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఈ పథకం కింద కొత్తగూడెం నియోజకవర్గంలో 66, ఇల్లెందులో 57, వైరా (జూలూరుపాడు మండలం)లో 17, అశ్వారావుపేటలో 86, పినపాకలో 86, భద్రాచలం నియోజకవర్గంలో 56 పాఠశాలలను ఎంపిక చేశారు. అయితే గతేడాది కురిసిన వర్షాలు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, వారిని మార్పు చేయడం వంటి వాటితో పనుల్లో జాప్యం జరిగిందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ఈ విద్యా సంవత్సరం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో మరికొన్ని పాఠశాలల్లో పనులు వేగవంతం చేస్తున్నామని అంటున్నారు. ఇప్పటికే పూర్తయిన 40 పాఠశాలలను ప్రారంభిస్తామని చెబుతున్నారు.

రూ.60 కోట్ల వ్యయంతో..

జిల్లాలో మొదటి దశలో ఎంపికైన 368 పాఠశాలల్లో పనుల నిర్మాణానికి రూ.60 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ అయ్యాయి. అభివృద్ధి పనుల్లో భాగంగా పాఠశాలల్లో ప్రహరీలు, వంట గదులు, టాయిలెట్స్, ఇతర మరమ్మతు పనులు చేపట్టనున్నారు. రూ.30 లక్షల లోపు ఉన్న పనులు ఎస్‌ఎంసీ కమిటీల ద్వారా చేయిస్తుండగా, అంతకంటే ఎక్కువైతే టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లతో అప్పగిస్తున్నారు. కాంట్రాక్టర్లు చేసే పనులను ప్రధానోపాధ్యాయులు నిరంతరం పరిశీలన చేయాల్సి ఉంటుంది. పూర్తయిన పనులను ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న పనులు, పూర్తయిన పనులను బట్టి దశల వారీగా నిధులు విడుదలవుతున్నాయి. ఇలా గత వారం రూ.11 కోట్లు రాగా, ఈ వారంలో మరో రూ.9 కోట్లు విడుదల కానున్నాయి. ఇక పాఠశాలలకు పెయింటింగ్, తరగతి గదిలో బోర్డులు, విద్యార్థులు కూర్చునే డెస్కులు అన్నీ ప్రభుత్వమే నేరుగా పంపిణీ చేస్తోంది.

పనుల్లో వేగం పెరుగుతోంది



మన ఊరు–మన బడికి సంబంధించి నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. ఇప్పటికే కొన్ని పాఠశాలలను ప్రారంభించాం. మరికొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. నిర్మాణ పనులపై కలెక్టర్ అనుదీప్ రోజు వారీ రిపోర్ట్ తెప్పించుకుని పరిశీలన చేస్తున్నారు. పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖ అధికారి

పోలీసుల సేవలు భేష్..



జ్యోతిప్రజ్వలన చేస్తున్న విప్ రేగా, పక్కన కలెక్టర్, ఐటీడీఏ పీఓ, ఎస్పీ, ఎమ్మెల్యేలు వనమా, మెచ్చా

- శాంతిభద్రతల పరిరక్షణలో పనితీరు మరువలేనిది
- ప్రభుత్వ విప్ రేగా కాంతారావు
- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా దశాబ్ది వేడుకలు



ర్యాలీలో విప్ రేగా, కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్, ఎమ్మెల్యే వనమా, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

కొత్తగూడెంరూరల్/పాల్వంచ : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ సమర్థవంతంగా కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఆదివారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి సెంట్రల్ పార్క్ నుంచి పాల్వంచ పట్టణంలోకి, అక్కడి నుంచి కలెక్టర్ కార్యాలయం మీదుగా ఇల్లెందు క్రాస్ రోడ్డు, రైల్వేస్టేషన్, ఎంజీ రోడ్డు మీదుగా జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు చేరుకుంది. సుమారు 350 వాహనాలతో భారీ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేగా కాంతారావు మాట్లాడుతూ.. జిల్లాలో పోలీసుల సేవలు భేష్‌గా ఉన్నాయని అభినందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని చెప్పారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పోలీసులు అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ పని చేస్తున్నారని చెప్పారు. ఎస్పీ వినీత్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా తమ శాఖ ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అవతరణ దశాబ్ది ఉత్సవాలను జిల్లా పోలీసులు విజయవంతంగా నిర్వహించారని అభినందించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు, అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా, పాల్వంచ అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ కటౌట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంబేద్కర్ సెంటర్‌లో కలెక్టర్‌కు డీఎస్పీ వెంకటేశ్, ఎస్పీకి డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్ జాతీయ జెండాలను అందించారు.



జగదభిరాముడికి 'జ్యేష్ఠాభిషేకం'



సహస్ర కలశాభిషేకం చేస్తున్న అర్చకులు



యాగశాలలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలయంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి పూజలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా జగదభిరాముడికి ఆదివారం జ్యేష్ఠాభిషేకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి రోజున స్వామివారికి ఈ వేడుక జరిపించడం సంప్రదాయం. ఆలయ ఈఓ రమాదేవి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు కనులపండువగా ఈ కార్యక్రమాన్ని గావించారు. తొలుత బేడా మండపంలో ఏర్పాటు చేసిన 81 కలశాలలో సమస్త నదీ జలాలను ఆవాహన చేశారు. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం, నదీ జలాలతో జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. వేద పండితులు ఈ ఉత్సవ ప్రాముఖ్యతను వివరించారు. తొలకరి జల్లుల సమయంలో వరుణదేవుడి కరుణా కటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురవాలని, తద్వారా దేశం సుభిక్షంగా వర్ధిల్లాలని కోరుతూ పూజలు చేసినట్లు తెలిపారు. అనంతరం స్వామివారికి హారతి సమర్పించారు. ఈ వేడుకను పురస్కరించుకుని ఆదివారం నిత్యకల్యాణం నిలిపివేయగా, సోమవారం యథాతథంగా జరుగుతుందని అర్చకులు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రశాంతం



విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్: సుజాతనగర్‌లోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పేపర్–1, 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పేపర్–2 పరీక్షలు జరిగాయి. మొత్తం 113 మంది విద్యార్థులకు గాను పేపర్–1 పరీక్షకు 109 మంది, పేపర్–2 పరీక్షకు 108 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

మానవ అక్రమ రవాణాను నియంత్రించాలి


సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భరతరాణి



సదస్సులో మాట్లాడుతున్న భరతరాణి

ఖమ్మంగాంధీచౌక్: చాప కింద నీరులా విస్తరిస్తున్న మానవ అక్రమ రవాణాను నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఖమ్మం సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భరతరాణి తెలిపారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నగరంలోని కొత్త బస్టాండ్‌లో యాంటీ ట్రాఫికింగ్, చైల్డ్‌లైన్ సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా భరతరాణి మాట్లాడుతూ నానాటికీ నేర ప్రవృత్తి పెరుగుతుండగా, మానవ సంబధాలను మరిచి పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు నేటితరంలో మరింత అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఏహెచ్‌టీయూ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ మాట్లాడుతూ అనుమానాస్పదంగా కనిపించే వారి వివరాలను డయల్ 100 లేదా 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు.

జీవ వైవిధ్యమే మూలం



కిన్నెరసానిలో సంచరిస్తున్న చుక్కల దుప్పులు

- పర్యావరణంపై ప్రభావం చూపుతున్న 'విష' వ్యవసాయం
- అడవులు అంతరించడమూ కారణమే!
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

పాల్వంచరూరల్ : జీవ వైవిధ్య మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. ప్రపంచంలో ఎన్నో రకాల జీవ రాశులు తమకంటూ ప్రత్యేక జీవన విధానాన్ని కలిగి ఉంటాయి. అయితే నేడు పలు కారణాలతో అనేక రకాల జీవులు ప్రాణాలు కోల్పోతున్నాయి. పంట సాగులో ఉపయోగించే క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువులతో పిచ్చుకలు, చిలకలు, వానపాములు, ఇంకా పలు రకాల పురుగులు అంతరించిపోతున్నాయి. నిషేధిత గడ్డి మందులు, విష గుళికల వాడకంతో ఎలకలు, ముంగీసలు వంటివి మృత్యువాత పడుతున్నాయి. జీవ వైవిధ్యంలో కీలక భూమిక పోషిస్తున్న అడవులు సైతం క్రమంగా అంతరించిపోతున్నాయి. అడవుల్లో చెట్లు విరివిగా ఉంటే వాతావరణాన్ని చల్లబర్చడంతో పాటు కాలుష్యం బారి నుంచి రక్షిస్తాయి. కానీ స్మగ్లరు యథేచ్ఛగా అడవులు నరికేస్తున్నారు. ఇలాంటి చర్యలతో జీవవైవిధ్య మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అంతరించి పోతున్న జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉంది. దాని ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

కిన్నెరసానిలో కీలక చర్యలు..

జీవ వైవిధ్య పరిరక్షణకు జిల్లాలోని కిన్నెరసాని అభయారణ్యంలో పలు రకాల చర్యలు చేపడుతున్నారు. ఇక్కడ ప్రధానంగా పులి, చిరుతలు, అడవిదున్నలు, ఎలుగుబంట్లు, చుక్కల దుప్పులు, కొండగొర్రెలు, నక్కలు, అడవి పందులు, కణుజులు, మనుబోతులు, కోతులు, కొండముచ్చులు, కస్తూరి పిల్లులు, బెట్టు ఉడతలు, నెమళ్లు, మొసళ్లు, పలు రకాల పాములు.. ఇలా 200 రకాల జీవులకు ఈ అభయారణ్యం ఆవాసంగా ఉంది. దట్టమైన అరణ్యం, విస్తారమైన పచ్చిక బయళ్లు, ఏడాదంతా నీరు నిల్వ ఉండే రిజర్వాయర్, వేల రకాల వృక్ష జాతులు, సహజ వనరులతో కిన్నెరసాని పరిఢవిల్లుతోంది. ఇలా ఇక్కడ పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి జరుగుతున్నప్పటికీ.. మిగితా ప్రాంతాల్లో అనేక కారణాలతో పక్షులు, వృక్షాలు, జంతువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది.

జీవకోటిని రక్షించుకుందాం



అంతరించిపోతున్న జీవ జాతుల పరిరక్షణకు, కనుమరుగవుతున్న సహజ వనరుల సంరక్షణకు, పర్యావరణ పరిరక్షణకు ప్రజలను భాగస్వాములను చేయాలి. దీంతో పాటు ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉంది. పర్యావరణ పరిరక్షణపై ప్రాథమిక విద్య నుంచే పాఠ్యాంశాలను రూపొందించాలి. – చంద్రశేఖర్, జంతు ప్రేమికుడు

జీవ వైవిధ్య పరిరక్షణకు కృషి



కిన్నెరసాని అభయారణ్యంలో జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాం. అభయారణ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాం. ప్రతి సంవత్సరం వేసవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అడవుల్లో నీటి కుంటలు ఏర్పాటు చేస్తున్నాం. ఇతర జీవరాశుల కోసం గడ్డి మైదానాలు, పండ్ల మొక్కలు పెంచుతున్నాం. పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై గిరిజన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– కె.దామోదర్‌రెడ్డి, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ

'ఉపాధి'లో పట్టభద్రులు

- వంద రోజుల పనులకు వెళ్తున్న విద్యాధికులు
- జిల్లాలో రోజుకు 5వేల మంది హాజరు
- తల్లిదండ్రులకు అండగా నిలుస్తున్న యువత



చుంచుపల్లి తండాలో ఉపాధి పనులు చేస్తున్న విద్యాధికులు

చుంచుపల్లి: ఉన్నత చదువులు చదివిన ఎంతోమంది యువతీ యువకులు ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. పలుగు, పార చేతబట్టి మండుటెండల్లో కష్టపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో గ్రామాలకు కనీస వసతులతో పాటు, కూలీలకు పని కల్పిస్తోంది. ప్రస్తుతం కూలీలతో పాటు విద్యావంతులైన యువతకు కూడా ఈ పథకం వరంగా మారింది. ప్రతి వేసవిలో నిరుద్యోగ యువత వంద రోజుల పనులకు ఎక్కువగా వెళుతుంటారు. 2020, 2021లో కరోనా కారణంగా సొంతూళ్లకు చేరిన యువకులకు ఉపాధి పనులే అండగా నిలిచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం డిగ్రీ, పీజీ చదువుతున్న వారు సైతం ఉపాధి పనులు చేస్తున్నారు.

పలువురికి ఆదర్శంగా..

జిల్లాలో 481 గ్రామ పంచాయతీల్లో ఏప్రిల్ నుంచి ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో 2.21 లక్షల కుటుంబాలు జాబ్ కార్డులు కలిగి ఉండగా, వాటిలో 4.60 లక్షల మంది కూలీలు పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో 20 వేల మంది వరకు డిప్లొమా, బీఏ, బీకాం, పీజీ, ఇంజనీరింగ్, బీఈడీ వంటి ఉన్నత విద్యావంతులు ఉన్నారు. వీరిలో చాలా మంది పేద, సన్న, చిన్న కారు రైతు కుటుంబాలకు చెందిన వారు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక సొంత ఊరిలోనే వందరోజుల పనులు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక పట్టణాల్లో ఉన్నత విద్యనభ్యసించే కొందరు యువకులు కూడా ఉపాధి పనులకు వెళుతూ తమ అవసరాలకు డబ్బు సంపాదించుకుంటున్నారు. ప్రస్తుతం ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో సగటున రోజుకు 120 మంది కూలీలు పనులకు వస్తుండగా, వారిలో పది శాతం మంది విద్యాధికులే ఉంటున్నారు. అంటే జిల్లా వ్యాప్తంగా రోజుకు ఐదు వేల మందికి పైగా పట్టభద్రులు ఉపాధి పనులు చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

వేసవిలో ఆసరాగా నిలుస్తున్నాయి



నేను తొలిసారి 2019లో జాబ్ కార్డులో పేరు నమోదు చేసుకున్నా. వేసవిలో ఇతర వ్యవసాయ పనులు ఉండనందున రోజూ క్రమం తప్పకుండా ఉపాధి పనులకు వెళ్తున్నా. ప్రతి వేసవి సీజన్‌లో అందరితో కలిసి వందరోజుల పనులకు వెళ్లడం ఆనందంగా ఉంది. ఈ డబ్బు కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. – బానోత్ శ్రీలక్ష్మి, బీఎస్సీ

సొంతూర్లోనే ఉపాధి



నేను 2021లో జాబ్ కార్డులో పేరు నమోదు చేసుకున్నా. ఉన్న ఊర్లోనే పని దొరుకుతోంది. వేసవిలో ఖాళీగా ఉండకుండా ఈ పనులకు వస్తున్నా. నాతో పాటు చదువుకున్న వారితో కలిసి పనులకు వస్తున్నా. ఉపాధిహామీ పనులు నిరుద్యోగులకు ఎంతో భరోసాగా నిలుస్తున్నాయి.

– అంగోత్ భాస్కర్, ఎంసీఏ

ఇతర పనులకు వెళ్లలేక..



నేను బీకాం, సీఏ రెండేళ్ల క్రితం పూర్తి చేశా. 2020లో జాబ్‌కార్డులో పేరు నమోదు చేసుకున్నా. ఇప్పుడు అదే ఉపాధి పనులకు వచ్చేందుకు అవకాశం కల్పిస్తోంది. ప్రతి ఏడాది వేసవిలో కుటుంబసభ్యులతో కలిసి ఉపాధి పనులకు వస్తా. ఈ సీజన్‌లో ఇతర పనులకు వెళ్లలేక అందుబాటులో ఉన్న ఉపాధిని సద్వినియోగం చేసుకుంటున్నా. – చరిత, బీకాం, సీఏ

క్లుప్తంగా

పొట్టకూటి కోసం వెళ్తూ..

● రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


కొండా సత్యం (ఫైల్)

కొణిజర్ల: కుటుంబ జీవనోపాధి కోసం వస్తువులు కొనితెచ్చుకునేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని మరో వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఎస్‌ఐ జె.శంకర్‌రావు కథనం మేరకు.. మండలంలోని పల్లిపాడుకు చెందిన కొండా సత్యం (47) గ్రామాల్లో తిరిగి బుట్టలు, చాటలు అమ్ముకుని జీవనం సాగిస్తుంటారు. ఆదివారం ఉదయం తల్లాడ మండలం అంజనాపురంలో బుట్టలు, చాటలు కొనుగోలు చేయడానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పల్లిపాడు, వైరా మధ్య పెట్రోలు బంక్ సమీపాన వెనుక నుంచి వచ్చిన బుల్లెట్.. సత్యం వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, బుల్లెట్‌పై వెళ్తున్న ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఎర్రగుండ్లపాలెంనకు చెందిన శ్రీనివాసరెడ్డితో పాటు మరొకరికి గాయాలయ్యాయి. మృతుడికి భార్య గోవిందమ్మ, కుమారుడు సురేశ్, కూతురు చైతన్య ఉన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


మంటలు ఆర్పుతున్న సిబ్బంది

నేలకొండపల్లి: రైతులు పొలంలో చెత్తకు నిప్పు పెట్టగా మంటలు ఎగిసిపడి పెట్రోల్ బంక్ సమీపానికి రావడంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పడంతో పెనుప్రమాదం తప్పింది. మండలంలోని సింగారెడ్డిపాలెం శివారులో జాతీయ రహదారి నిర్మాణ కంపెనీ బాధ్యులు సొంతంగా బంక్ ఏర్పాటు చేసుకున్నారు. దీని సమీపాన రైతులు పొలాల్లో చెత్తకు నిప్పు పెట్టగా మంటలు బంక్ వైపు దూసుకొచ్చాయి. దీంతో సిబ్బంది నేలకొండపల్లి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక శాఖ ఉద్యోగులు పి.చిన్న రామయ్య, బి.గోపి, వి.భాస్కర్‌రావు, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మారణాయుధాలతో వ్యక్తిపై దాడి

కొణిజర్ల: ఇద్దరు వ్యక్తుల నడుమ మొదలైన స్వల్ప ఘర్షణ మారణాయుధాలతో దాడి చేసుకునే వరకు వచ్చింది. బాధితుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుబ్బగుర్తికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ బానోత్ సునీల్ శనివారం తీగలబంజరలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ పెద్ద రాంపురానికి చెందిన వేముల కిశోర్‌తో గొడవ జరగగా, ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న సునీల్‌పై మారణాయుధాలతో కిశోర్ దాడి చేశాడు. ఈ ఘటనలో సునీల్ ముఖం, పొట్టపై తీవ్ర గాయాలుకాగా, ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. ఆయన భార్య శారద ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శంకర్‌రావు తెలిపారు.

ఆలయంలో హుండీ ఎత్తుకెళ్లిన దుండగులు


నాగులవంచ గంగమ్మ గుడి వద్ద లభ్యమైన హుండీ

బోనకల్/చింతకాని: బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల శ్రీ కంఠమామహేశ్వరుడి ఆలయంలో హుండీ శనివారం రాత్రి చోరీకి గురైంది. ఇటీవల నిర్మించిన ఆలయంలో హుండీ ఏర్పాటు చేయగా గుర్తుతెలియని వ్యక్తులు గేటు తాళం కోసి లోనికి ప్రవేశించి హుండీని ఎత్తుకెళ్లారు. ఆలయంలో కొద్దిరోజుల కిందట జాతర జరగడంతో హుండీలో రూ.50 వేల వరకు నగదు ఉంటుందని పేర్కొంటూ ఆలయ కమిటీ బాధ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఈ హుండీని చింతకాని మండలం నాగులవంచ ఎన్నెస్పీ కాల్వ సమీపాన స్థానికులు గుర్తించారు. తాళం పగులగొట్టి నగదు తీసుకున్న దుండుగులు హుండీని పడేసి వెళ్లిపోయారు.

యువతి అదృశ్యం

భద్రాచలంఅర్బన్: యువతి అదృశ్యంపై పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని శిల్పినగర్ కాలనీకి చెందిన యువతి కనితి నందిని శనివారం రాత్రి ఒంటి గంటకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఇంటి పక్కన ఉన్న సాయి అనే వ్యక్తితో కొంతకాలంగా ప్రేమ వ్యవహారం నడుస్తోందని, అతని కారణంగానే ఇంట్లో నుంచి వెళ్లి పోయిందని యువతి తల్లి లక్ష్మి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,346

వరుస చోరీలతో బెంబేలు

● సుజాతనగర్‌లో పెరిగిపోతున్న దొంగతనాలు
● తాజాగా రూ. 87 లక్షల విలువైన ఆభరణాలు అపహరణ


చోరీ చేసేందుకు బంగారు దుకాణం గోడకు చేసిన రంధ్రం

సుజాతనగర్: వరుస చోరీలు మండల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తాళం వేసిన ఇళ్లు, దుకాణాలే లక్ష్యంగా దొంగతనాలు జరుగుతున్నాయి. పాత నేరస్తులు, ఇతర ప్రాంతాలకు చెందిన ముఠాలు కూడా చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుండగా వారిని పట్టుకోవడం పోలీసులకు తలకు మించిన భారంగా మారుతోంది. మండల కేంద్రంలో రెండు, మూడు చోట్ల పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటితోపాటు చాలా వరకు ఆయా దుకాణాల్లో యజమానులే స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే దొంగలు సీసీ కెమెరాల్లో పడకుండా చాకచక్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 1న రాత్రి మండల కేంద్రంలోని ఓ బంగారు దుకాణంలో భారీ చోరీ జరిగింది. రూ.87 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరించారు. దుకాణం పక్క గదిలో అద్దెకు దిగిన గుర్తు తెలియని వ్యక్తులు గోడకు రంధ్రం చేసి షాపులోకి ప్రవేశించారు. చోరీకి పాల్పడిన వారు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారుగా పోలీసులు భావిస్తుండగా, సుజాతనగర్‌లో ఇంత భారీ చోరీ జరగడం ఇదే తొలిసారి.

సరైన పెట్రోలింగ్ లేక..?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆవిర్భావం తర్వాత సుజాతనగర్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ ప్రాంతంలో రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉండటంతో పలువురు గృహ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో నిఘా కూడా పెరగాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం శుభకార్యాల వేళ ఇంటికి తాళం వేసి వెళ్లాలంటే దొంగల భయంతో జంకుతున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు సరైన పెట్రోలింగ్ నిర్వహించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిఘా పెంచుతాం



దొంగతనాల నేపథ్యంలో నిఘా పెంచుతాం. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు లేదా 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలి. ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఊరెళితే ఇంట్లో విలువైన వస్తువులు, ఆభరణాలు నగదు ఉంచకపోవడం మంచిది. మాకు సమాచారం ఇస్తే ఆ ప్రాంతాల్లో నిఘా ఉంచడంతో పాటు పెట్రోలింగ్ నిర్వహిస్తాం.

– రమాకాంత్, చుంచుపల్లి సర్కిల్ సీఐ

ఏడాది కాలంలో జరిగిన చోరీల్లో కొన్ని..

గతేడాది ఏప్రిల్‌లో శివాలయంలో చోరీ జరిగింది. గత సెప్టెంబర్‌లో సుజాతనగర్‌లోని తాళం వేసిన ఇంట్లోకి చొరబడి బంగారం ఎత్తుకెళ్లారు. నవంబర్‌లో నర్రా శివరామకృష్ణ అనే వ్యక్తి ఇంట్లో రూ.85 వేల విలువైన బంగారం అపహరించారు. డిసెంబర్‌లో ఓ వెంచర్‌లోని ఇంట్లో ల్యాప్‌ట్యాప్, మొబైల్, కొంత నగదు చోరీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. మార్చిలో రాఘవాపురంలోని అంకమ్మతల్లి ఆలయంలో చోరీ జరిగింది. వేపలగడ్డ గ్రామంలోని ఓ ఇంట్లో సుమారు లక్ష విలువ చేసే బంగారం చోరీకి గురైంది. గత నెలలో వేపలగడ్డ, సుజాతనగర్‌లో బంగారం చోరీకి గురైంది.

విందు, వినోదాలే అభివృద్ధా?

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య


కరపత్రాలు పంపిణీ చేస్తున్న గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు/ఇల్లెందురూరల్: తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చకుండా కోట్లాది రూపాయలతో విందు, వినోదాలు ఏర్పాటు చేస్తే అభివృద్ధి సాధించినట్లా? అని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ప్రశ్నించారు. ప్రజాపంథా ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇల్లెందు పట్టణంలో, మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ క్యాంపుసెంటర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏం చేశారని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, అమరవీరుల కలలను సాకారం చేయకుండా హేళన చేసేలా చేయటమేనా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సార్థకత అని పేర్కొన్నారు. మాయమాటలతో గారడీ చేసి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూంలు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, రేషన్ కార్డులు ఇలా అనేక వాగ్దానాలు బుట్టదాఖలు అయ్యాయని విమర్శించారు. కేసీఆర్ పాలనలోని లోపాలను ప్రశ్నించకుండా తప్పుదారి పట్టించటంకోసమే వేడుకలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియామకాల ప్రతిపాదికన ఏర్పడిన తెలంగాణలో ప్రజల ఆకాంక్షలను నీరుగార్చారని విమర్శించారు. సీఎం కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకుబ్ షావలీ, బుర్ర వెంకన్న, భాస్కర్, దుర్గారావు, వీరస్వామి, నాయిని రాజు, బోస్ తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన నాయకులు, కార్యకర్తలు

● బీఆర్‌ఎస్‌కు పలువురి రాజీనామా

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన 200 కుటుంబాలు బీఆర్‌ఎస్ పార్టీకి ఆదివారం రాజీనామా చేశాయి. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ ఆధ్వర్యాన తాము ఇక నుంచి మాజీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బాటలో నడవనున్నట్లు వారు వెల్లడించారు. రాజీనామా చేసిన వారిలో బండి లక్ష్మీనర్సు, బండి ఎల్లయ్య, వేముల రాంబాబు, చిరంజీవి, బత్తుల రాంబాబు, వార్డు సభ్యులు తొండల ముత్తయ్య, మొగిలి విజయ, మేకపోతుల మహేశ్‌గౌడ్, బానోతు నరసింహ తదితరులు ఉన్నారు.

రెవెన్యూలో భారీగా అక్రమాలు

● భూ వివాదంలో రూ.60లక్షల ఆర్థిక లావాదేవీలు?
● సీనియర్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ
● ఆర్డీఓను విచారణాధికారిగా నియమించిన కలెక్టర్

అశ్వారావుపేటరూరల్: రెవెన్యూ శాఖలో అక్రమాలకు పాల్పడిన ఓ సీనియర్ అసిస్టెంట్‌కు కలెక్టర్ అనుదీప్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ ఉదంతం ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు పరిశీలిస్తే.. అశ్వారావుపేట తహసీల్దార్ కార్యాలయంలో గుర్రం ప్రభాకర్‌రావు సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కాగా ఓ సంస్థ, మరో రైతుకు, ఇంకో పక్షంలోని ఇద్దరు వ్యక్తుల మధ్య భూ వివాదం ఉన్నది. అశ్వారావుపేట రెవెన్యూ పరిధిలోని 1130/15/1/11, 1130/15/1/2 సర్వే నంబర్లలో పది ఎకరాలకు సంబంధించి వివాదం ఉండగా, సదరు ఇద్దరు వ్యక్తులకు పట్టా భూములపై హక్కులు కల్పించినందుకు సీనియర్ అసిస్టెంట్ భారీగా డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం బెడిసి కొట్టడం, సదరు ఉద్యోగి వేధింపుల నేపథ్యంలో బాధితులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పట్టా భూములకు సంబంధించిన వివాదాల్లో సెటిల్‌మెంట్లు, సివిల్ ల్యాండ్ వివాదంలో దాదాపు రూ.60 లక్షల వరకు ఆర్థిక లావాదేవీలు సాగినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. సదరు ఉద్యోగి మాట్లాడిన సెల్‌ఫోన్ ఆడియో, వాట్సాప్ వీడియో కాల్స్ రికార్డులు తదితర ఆధారాలను కూడా సమర్పించారు. దీంతో కలెక్టర్ గత నెల 29న షోకాజ్ నోటీసు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. పట్టా భూములు, ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆర్‌సీ నంబరు ఏ1/1340/2023 ద్వారా కొత్తగూడెం ఆర్డీఓను ఆదేశించారు. కాగా కార్యాలయానికి సంబంధించిన విలువైన రికార్డుల్లో అక్రమాలకు పాల్పడినట్లు కూడా సదరు ఉద్యోగిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై తహసీల్దార్ లూథర్ విల్సన్‌ను వివరణ కోరగా.. షోకాజ్ నోటీసు వచ్చిన మాట వాస్తవమేనని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.


నిర్మానుష్యంగా మారిన కొత్తగూడెం బస్టాండ్ సెంటర్

నిప్పుల వాన..

● గరిష్ఠంగా 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
● వడగాలులతో జిల్లా వాసుల ఉక్కిరిబిక్కిరి

జిల్లాలో ఉష్ణోగ్రతల వివరాలు..	
జూలురుపాడు	46.4
యానంబైలు (పాల్వంచ	46.4
సీతారాంపట్నం(పాల్వంచ	46.0
ఏడూళ్లబయ్యారం(పినపాక)	45.7
అశ్వాపురం	45.6
పెంట్లాం(అన్నపురెడ్డిపల్లి)	45.3
భద్రాచలం	45.3
ములకలపల్లి	45.3
లక్ష్మీదేవిపల్లి	45.2
కరకగూడెం	45.1
నాయుడుపేట(దమ్మపేట)	45.1
సుజాతనగర్	45.1
పాత కొత్తగూడెం	45.0
గరిమెళ్లపాడు(చుంచుపల్లి)	44.8
బూర్గంపాడు	44.5
సత్యనారాయణపురం(చర్ల)	44.5

చుంచుపల్లి: భానుడి నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. రెండు రోజులుగా ఎండలు మండుతున్నాయి. ఆదివారం జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత కనిపించగా, మధ్యాహ్నం తీవ్రరూపం దాల్చింది. జూలూరుపాడు, పాలవ్వంచ మండలం యానంబైలు ప్రాంతాల్లో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. పినపాక (ఏడూళ్ల బయ్యారం), అశ్వాపురంలో 45.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనధికారికంగా ప్రస్తుతం నమోదయ్యే ఉష్ణోగ్రతల కంటే రెండు, మూడు డిగ్రీలు అధికంగానే ఉంటాయని ప్రజలు అంటున్నారు. ఎండ తీవ్రతకు తోడు వడగాలులతో వృద్ధులు, మహిళలు, పిల్లలు అల్లాడిపోయారు. ఇల్లు దాటి కాలు బయట పెట్టేందుకు ప్రజలు జంకుతున్నారు. గాలిలో తేమశాతం తగ్గిపోవడంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రజలు మరో వారం రోజులపాటు ఎండల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

గాలివానకు విరిగిన చెట్లు


లక్ష్మీనగరం రహదారిపై విరిగిపడిన వృక్షం


సున్నంబట్టిలో ఎగిరిపడిన ఇళ్ల పైకప్పులు

చర్ల: చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. చెట్లు విరిగిపడడంతోపాటు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. చర్ల మండలంలోని రాళ్లగూడెం, కుదునూరు, సత్యనారాయణపురం, దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరం, ప్రగళ్లపల్లి, కాశీనగరం తదితర గ్రామాల్లో చెట్లు విరిగిపడ్డాయి. లక్ష్మీనగరం ప్రధాన రహదారిపై భారీ చింతచెట్టు విరిగి పడటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సున్నంబట్టి గ్రామంలో ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ నిర్మించిన ఇళ్ల పైకప్పులు ఎగిరి దూరంగా పడ్డాయి. విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టి రాత్రి 8 గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.

ఐఏఎల్ జాతీయ సమితి సభ్యుడిగా శేషగిరిరావు


శేషగిరిరావు

ఖమ్మంలీగల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ సమితి సభ్యుడిగా ఖమ్మం జిల్లాకు చెందిన న్యాయవాది ఓరుగంటి శేషగిరిరావు ఎన్నికయ్యారు. ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు కేరళ రాజధాని త్రివేండ్రంలో ఐఏఎల్ 11వ జాతీయ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్రం నుంచి ఏడుగురికి జాతీయ సమితి సభ్యులుగా అవకాశం దక్కగా ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురానికి గ్రామానికి చెందిన శేషగిరిరావు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా శేషగిరిరావును ఆయనను సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు మహమ్మద్ మౌలానా, దండి సురేశ్‌తో పాటు తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్దన్ తదితరులు అభినందించారు.

రామయ్య దర్శనానికి వచ్చి..

గోదావరిలో మునిగి ఏపీ వాసి మృతి


రామకృష్ణ మృతదేహం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద గోదావరిలో మునిగి ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా గన్నవరం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన రాయుడు రామకృష్ణ (40)కుటుంబ సభ్యులతో భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చాడు. ఈ క్రమంలో స్నానం చేసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి గోదావరిలో దిగాడు. సరదాగా ఈత కొడుతున్న క్రమంలో నీటి లోతు అంచనా వేయలేక నదిలో మునిగిపోయాడు. అతని అరుపులు విని గజ ఈతగాళ్లు కాపాడేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే నీటిలో గల్లంతయ్యాడు. గాలింపు చేపట్టిన గజ ఈతగాళ్లు కొద్దిసేటికి మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. రామకృష్ణ కుటుంబ సభ్యులు చూస్తుండగానే ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్..

బూర్గంపాడు: మండల పరిధిలోని మోరంపల్లిబంజర సమీపంలో మత్రికుంట వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... కొత్తగూడెంలోని బూడిదగడ్డ బస్తీకి చెందిన గాజ హనుమంతు(49) ఆటోలో కూరగాయల బస్తాలు తీసుకుని మణుగూరు వైపు వస్తున్నాడు. మత్రికుంట సమీపంలో అదే రూట్‌లో వస్తున్న కారు ముందుటైరు పగిలిపోవటంతో అదుపుతప్పి ఆటోను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలై హనుమంతు అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై సంతోష్ ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. మృతునికి భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుమారుడు సందీప్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

ఇల్లెందు: యజమాని వేధింపులతో మొబైల్ దుకాణం నడిపే వ్యక్తి ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన ఆదివారం ఇల్లెందు పట్టణంలోని ఆంబజార్‌లో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో జాకీర్ అనే వ్యక్తి పదేళ్లుగా షాపు అద్దెకు తీసుకుని సెల్‌ఫోన్ల మరమ్మతులు చేపడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రూ.5 లక్షలు ఇవ్వాలని, లేకపోతే ఖాళీ చేయాలని షాపు ఓనర్ రాకేష్ మూడు నెలలుగా ఒత్తిడి చేస్తున్నాడు. దీంతో మనస్తాపం చెందిన జాకీర్ ఎలుకల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతున్నాడు. కాగా పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బాధితుడు జాకీర్ తెలిపాడు.

ఖమ్మం డీఆర్వో సీసీ రామారావు మృతి

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం జిల్లా రెవెన్యూ అధికారి సీసీగా విధులు నిర్వర్తిస్తున్న తేజావత్ రామారావు (42) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా కురవి సమీపాన ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరగగా ఆయన మృతి చెందినట్లు సమాచారం అందింది. తొలుత పోలవరం ప్రాజెక్ట్ కార్యాలయంలో విధులు నిర్వర్తించిన రామారావు.. రాష్ట్రాల విభజన సమయాన రెవెన్యూ శాఖలో కంప్యూటర్ కమ్ టైపిస్టుగా విధుల్లో చేరారు. నాటి నుంచి అనేక మంది డీఆర్వోల వద్ద సీసీగా పనిచేయగా, ప్రస్తుతం డీఆర్వో శిరీష సీసీగా కొనసాగుతున్నారు. సుమారు రెండేళ్ల పాటు జాయింట్ కలెక్టర్ వద్ద కూడా సీసీగా పనిచేశాడు. ఆయన భార్య లలిత విద్యాశాఖ అనుబంధ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తుండగా వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి స్వస్థలం కూసుమంచి మండలం రావిచెట్టితండా కాగా ఉద్యోగరీత్యా ఖమ్మంరూరల్ మండలం పెద్దతండాలో స్థిరపడ్డాడు. రామారావు మృతి వార్త తెలియడంతో డీఆర్వో సహా ఉద్యోగులు సంతాపం ప్రకటించారు.

వైద్యం వికటించి మహిళ మృతి?

నేలకొండపల్లి: వైద్యం కోసం వస్తే ఓ ఆర్‌ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్లు వికటించటంతో మహిళ మృతి చెందినట్లు తెలిసింది. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్‌కు చెందిన కరిశ పద్మ(57) కీళ్ల నొప్పులు ఉండటంతో ఆదివారం నేలకొండపల్లి మండలం పైనంపల్లిలో ఓ గ్రామీణ వైద్యుడి వద్దకు వచ్చింది. దీంతో నొప్పి తగ్గేందుకు ఆయన ఓ ఇంజక్షన్ ఇవ్వగా, మంటగా ఉందని, దద్దుర్లు వస్తున్నాయని చెప్పడంతో మరో ఇంజక్షన్ ఇచ్చాడు. గుండెలో ఇబ్బందిగా ఉందని, శ్వాస తీసుకోవటం కష్టంగా మారిందని చెప్పగా ఇంకో ఇంజక్షన్ ఇచ్చాడు. చివరకు ఆమె పరిస్థితి విషమించగా నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు పెద్దసంఖ్యలో చేరుకుని మృతదేహంతో పోలీస్‌స్టేషన్ సమీపానికి వచ్చారు. ఈ క్రమంలోనే సదరు ఆర్‌ఎంపీతో పెద్దలు చర్చించినట్లు సమాచారం. అనంతరం కూసుమంచి సీఐ జితేందర్, ఎస్‌ఐ జి.స్రవంతి వివరాలు ఆరా తీసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కాగా, తన తల్లికి అనారోగ్యంగా ఉండటంతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందిందని పద్మ కుమారుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

65 దాటితే రిటైరే..!

▶ మొదటి పేజీ తరువాయి

అంగన్‌వాడీ కేంద్రాలు, మరో 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కేవలం అంగన్‌వాడీ టీచర్లు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా.. ప్రధాన కేంద్రాల్లో టీచర్‌తో పాటు హెల్పర్ కూడా ఉంటారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 55,450 మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విధుల్లో ఉన్నారు. వీరిలో ఐదు శాతం మంది పదవీ విరమణకు దగ్గర్లో ఉండగా.. మరో రెండున్నర వేల మందికి పైగా 65 సంవత్సరాలకు పైబడినవారున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా వీరికి రిటైర్మెంట్ ఇచ్చేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రెండు రకాల ప్రతిపాదనలను ప్రభుత్వం ముందు ఉంచింది. పదవీ విరమణ పొందే టీచర్‌కు రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు ఆసరా పెన్షన్, కారుణ్య నియామకం కింద కుటుంబీకులకు అవకాశం ఇచ్చేలా ఒక ప్యాకేజీ తయారు చేసింది. అదే విధంగా రూ.2 లక్షల ఆర్థిక సాయంతో పాటు ఆసరా పెన్షన్ ఇచ్చే అంశాన్ని కూడా ప్రతిపాదించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంపై పడనున్న ఆర్థిక భారం తదితరాలపై ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు వద్ద మంత్రి సత్యవతి రాథోడ్, సంబంధిత అధికారులు ఇప్పటికే సుదీర్ఘంగా చర్చించారు. ఆయన ఈ అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో పదవీ విరమణపై స్పష్టత ఇస్తూ మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మినీ అంగన్‌వాడీలు లేనట్లే..

రాష్ట్రంలోని 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎక్కువ శాతం పట్టణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల్లోమినీ అంగన్‌వాడీ కేంద్రాలను రద్దు చేయాలనేది కూడా ఒకటి. దీంతో వీటన్నింటినీ అప్‌గ్రేడ్ చేస్తూ ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయితే ఆ మేరకు హెల్పర్ పోస్టులు కేటాయించి నియామకాలు చేపట్టాల్సి ఉంది. దీనిపై కూడా శిశు సంక్షేమ శాఖ ప్రతిపాదనలు రూపొందిస్తోందని, అతి త్వరలో ప్రభుత్వ నిర్ణయం కూడా వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

మధ్యవర్తిత్వంతో కోర్టులపై భారం తగ్గింపు

- విపరీత ఒత్తిడి ఏ వ్యవస్థకూ మంచిది కాదు
- ఈఎండబ్ల్యూ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై
- మధ్యవర్తిత్వ వ్యవస్థ పటిష్టం కావాలి: హైకోర్టు సీజే ఉజ్జల్ భూయాన్



ఈఎండబ్ల్యూ కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

సాక్షి, హైదరాబాద్: ఏదైనా వ్యవస్థపై అది భరించే శక్తికి మించి ఒత్తిడి పెంచితే ఆ వ్యవస్థ దెబ్బతింటుందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థ భారాన్ని తగ్గించడం 'మధ్యవర్తిత్వం'తోనే సాధ్యమని తెలిపారు. ఇంట్లోని చిన్న చిన్న తగాదాలు కూడా కోర్టుకు చేరడంతో పెండింగ్ కేసులు అంతకంతకూ పెరిగిపోతున్నాయన్నారు. ఇలాంటి కేసులన్నీ మధ్యవర్తిత్వంతోనే పరిష్కారం కావాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ-మీడియేషన్ రైటింగ్స్ (ఈఎండబ్ల్యూ) ఏర్పాటై మూడేళ్లయిన సందర్భంగా హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా గవర్నర్ తమిళిసై హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈఎండబ్ల్యూ మూడేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. 'అత్తాకోడలు, భార్యాభర్తలు, అన్నదమ్ములు.. ఇలా చిన్నచిన్న వివాదాలను ఇంటి స్థాయిలోనో లేదా గ్రామ స్థాయిలోనో ఎవరో ఒకరు మధ్యవర్తిత్వంతో పరిష్కరించే ఏర్పాట్లు జరగాలి. పేదలకు కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందే ఆర్థిక స్తోమత తక్కువ. అలాంటి వారి సమస్యల పరిష్కారం కోసం మధ్యవర్తులు ముందుకురావాలి'అని తమిళిసై పిలుపునిచ్చారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉందన్నారు. భరించే శక్తికి మించి న్యాయవ్యవస్థ భారం మోస్తోందని చెప్పారు. గతంలో గ్రామీణ స్థాయిలో, కుటుంబాల్లో ఉన్న మధ్యవర్తిత్వ వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీని ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందని, సత్వర న్యాయం అందుతుందన్నారు. కోర్టు తీర్పు తర్వాత సదరు పార్టీల మధ్య బంధం ఉండకపోవచ్చని, అదే మధ్యవర్తిత్వ పరిష్కారంలో వారి అంగీకారంతోపాటు బంధం బలహీనపడదని చెప్పారు. మీడియేటర్ల సంఖ్య కూడా చాలా తక్కువగా ఉందని, అది పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

ఇరు పార్టీలకు సమ న్యాయం..

కోర్టుల్లో వివాదాల పరిష్కారంతో పోలిస్తే మధ్యవర్తిత్వ పరిష్కారం అన్నివిధాలా ఉత్తమమైనదని పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి పేర్కొన్నారు. మధ్యవర్తిత్వంలో పార్టీలు ఇద్దరూ సఫలీకృతం అవుతారని, ఇద్దరికీ సమ న్యాయం అందుతుందని చెప్పారు. ఇంట్లో, ఊరిలో, సమాజంలో మధ్యవర్తులు ఉండి ఎక్కడికక్కడే సమస్యలకు చెక్ పెడితే అది సమాజ పురోభివృద్ధికి దోహదం చేస్తుందని వివరించారు. ప్రపంచమంతా అత్యంత క్లిష్ట పరిస్థితి ఎదుర్కొంటున్న కోవిడ్ సమయంలో ఈఎండబ్ల్యూ ఊపిరిపోసుకుందని తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి తెలిపారు. ప్రత్యక్ష కోర్టులు లేని సమయంలో కక్షిదారులకు సేవలందించిందని, ఇలా మూడేళ్లు పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. మధ్యవర్తిత్వం కోసం.. మధ్యవర్తిత్వం చేత.. మీడియేటర్లే నిర్వహిస్తున్న కార్యక్రమం ఈఎండబ్ల్యూ అని మీడియేషన్ ట్రైనర్ పుష్ప గుప్తా అన్నారు. అనంతరం మీడియేషన్ ట్రైనర్ ధన్కచన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ సైనిక బలగాల ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ జస్టిస్ రాజేంద్ర మీనన్, పలు రాష్ట్రాల న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఈఎండబ్ల్యూ తెలంగాణ కో-ఆర్డినేటర్ మంజీరా వెంకటేశ్, కేఎస్ శర్మ, చిత్రా నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో ప్రయాణికుల పాట్లు

సికింద్రాబాద్: ఒడిశాలో జరిగిన భారీ రైలు ప్రమాదం కారణంతో ఆదివారం కూడా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. పలు రైళ్ల దారిమళ్లించడం, మరికొన్ని రైళ్ల రద్దు కావడంతో రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. సికింద్రాబాద్-గౌహతి ఎక్స్‌ప్రెస్ రైలును దారి మళ్లించడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. ఉదయం రైళ్లన్నీ కొద్దిగంటల తేడాతో బయలుదేరి వెళ్లగా సాయంత్రం సికింద్రాబాద్ నుంచి బయలుదేరి వెళ్లాల్సిన విజయవాడ, భద్రాచలం రైళ్లను రద్దు చేశారు. దీంతో రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక సహాయక కౌంటర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు సమాచారం అందించారు.

మీరాకుమార్‌ని కలిసే టైం కేసీఆర్‌కు లేదా?

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్‌ను మర్యాదపూర్వకంగా కూడా కలిసేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నించకపోవడం ఆయన సంకుచిత బుద్ధికి నిదర్శనమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ విమర్శించారు.

553 మంది క్షేమం

- రెండు రైళ్లలో ఏపీ రాష్ట్రానికి చెందినవారు 696
- ప్రయాణాన్ని రద్దు చేసుకున్న వారు 92
- 22 మందికి గాయాలు, ఒకరు మృత్యువాత
- మరో 28 మంది ఆచూకీ కోసం ప్రయత్నాలు
- మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

సాక్షి, విశాఖపట్నం: ఒడిశాలో జరిగిన రైళ్ల ప్రమాద ఘటనలో ఏపీకి చెందిన 553 మంది క్షేమంగా ప్రమాదం నుంచి బయటపడ్డారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఆదివారం విశాఖ కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైల్వే జాబితా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రయాణికులు కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో 485 మంది, యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్‌లో 211 మంది వెరసి 696 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో 92 మంది ప్రయాణించలేదని చెప్పారు. మిగతా వారిలో 553 మంది ప్రయాణికులు క్షేమంగా ఉన్నారని, 21 మంది స్వల్పంగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళికి చెందిన గురుమూర్తి అనే వ్యక్తి మృత్యువాత పడ్డారన్నారు. మిగతా 28 మంది ప్రయాణికుల ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. వారి మొబైల్ నంబర్ల ఆధారంగా చిరునామా తెలుసుకోవడానికి పోలీస్ శాఖ ప్రయత్నిస్తోందని తెలిపారు.


ప్రమాద బాధితుడు సత్యంకు చెక్కును అందిస్తున్న మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ కల్యాణి


రైలు ప్రమాదంలో ఏపీ బాధితులకు పరిహారం

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు

సాక్షి, అమరావతి : ఒడిశా రైలు ప్రమాదంలో ఏపీకి చెందిన బాధితులందరికీ పరిహారం ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో రైలు ప్రమాద దుర్ఘటన, అధికారులు తీసుకుంటున్న చర్యలపై ముఖ్యమంత్రి ఆదివారం అధికారులతో సమీక్షించారు. రాష్ట్రం నుంచి ఒడిశాకు వెళ్లిన మంత్రి అమర్‌నాథ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం తీసుకుంటున్న చర్యలను, విశాఖపట్నంలో మరో మంత్రి బొత్స సత్యనారాయణ నేతృత్వంలో పర్యవేక్షణ కార్యకలాపాలను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఘటనలో రాష్ట్రానికి చెందిన వారు ఎవరైనా మరణించి ఉంటే.. వారి కుటుంబానికి రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.5 లక్షలు, స్వల్పంగా గాయపడ్డ వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీఎం ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అందిస్తున్న సహాయానికి ఇది అదనం అని స్పష్టం చేశారు. బాలాసోర్‌లో నివాసం ఉంటున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి మరణించారని, ఇది తప్ప రాష్ట్రానికి చెందిన వారెవరూ ఈ ఘటనలో మరణించినట్టుగా ఇప్పటి వరకు నిర్ధారణ కాలేదని అధికారులు వెల్లడించారు. గాయపడ్డ వారికి మంచి వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రేపటి నుంచి అధిక ఉష్ణోగ్రతలు

మహదేవ్‌పూర్‌లో 45.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత • నేడు కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళవారం నుంచి వారం రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణ అంతటా పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు స్థిరంగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, రాష్ట్రంలో ఆదివారం కొన్నిచోట్ల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లో ఆదివారం అత్యధికంగా 45.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం ఒక్క రోజు మాత్రం రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. కాగా దక్షిణ ఛత్తీస్‌ఘడ్ పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టం నుండి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతూ ఉంది.

ఆదివారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలివీ...

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత		
మహదేవ్‌పూర్ (జయశంకర్)	45.5	ఆదిలాబాద్	41.8
ముత్తారం (పెద్దపల్లి)	45.1	భద్రాచలం	43.0
జంబుగ (కొమురంభీం)	45.0	హన్మకొండ	41.5
బయ్యారం (మహబూబాబాద్)	44.9	హైదరాబాద్	38.1
ఖానాపూర్ (ఖమ్మం)	44.8	ఖమ్మం	43.0
సుజాతనగర్ (భద్రాద్రి కొత్తగూడెం)	44.8	మహబూబ్‌నగర్	36.6
కట్కూరు (సిద్దిపేట)	44.7	మెదక్	41.8
కల్వచెర్ల (పెద్దపల్లి)	44.7	నల్లగొండ	38.5
బాణాపురం (ఖమ్మం)	44.6	నిజామాబాద్	42.4
		రామగుండం	42.4

జిల్లా వార్తలు

కనీస వేతన అమలుకు కృషి చేస్తా..


మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

మణుగూరురూరల్: మిషన్ భగీరథలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాల అమలు కోసం కృషి చేస్తానని రాష్ట్ర వేజ్‌బోర్డ్ సలహా మండలి సభ్యుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి తెలిపారు. మణుగూరులోని మిషన్ భగీరథ పంప్‌హౌజ్ వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి కృషి చేస్తోందన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం, కార్మికశాఖ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి పాటుపడతానని తెలిపారు. సమావేశంలో మిషన్ భగీరథ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో జల విహారం


బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం సందడి నెలకొంది. జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి వచ్చిన పర్యాటకులు డీర్ పార్కులోని దుప్పులు, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించి బోటు షికారు చేశారు. కిన్నెరసానిలో టికెట్ల విక్రయం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.15,290, బోటు షికారు చేసిన వారి ద్వారా రూ.12,080 ఆదాయం టూరిజం శాఖకు సమకూరింది.

నేడు హౌరా ఎక్స్‌ప్రెస్ రద్దు

ఖమ్మం మామిళ్లగూడెం: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదం దృష్ట్యా షాలిమార్ నుండి హైదరాబాద్ వచ్చి వెళ్లే హౌరా ఎక్స్‌ప్రెస్‌ను సోమవారం రద్దు చేశారు. ఈ విషయాన్ని ఖమ్మం సీసీఐ జాఫర్ వెల్లడించారు. శాలిమార్ నుంచి హైదరాబాద్ వెళ్లే హైరా(18045)తో పాటు హైదరాబాద్ నుండి షాలిమార్ వెళ్లే హౌరా ఎక్స్‌ప్రెస్((18046)ను రద్దు చేసినట్లు తెలిపారు.

లోపభూయిష్టంగా సింగరేణి నియామకాలు



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

- 1990లో వెల్ఫేర్ ఆఫీసర్లుగా మహిళల నియామకం
- గనుల్లో మహిళలకు అవకాశం ఇవ్వాలని జీఓ
- ఇప్పటికే కోలిండియాలో విధులు, రాష్ట్రంలోనూ రిజర్వేషన్
- సింగరేణిలో మాత్రం మొండిచేయి చూపేలా నోటిఫికేషన్లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి రిక్రూట్‌మెంట్ లోపభూయిష్టంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ఒక ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఒక విధంగా, ఇంకో నోటిఫికేషన్‌లో మరోరకంగా నిబంధనలు పొందుపరుస్తున్నారు. అర్హతల విషయంలోనూ కొర్రీల కారణంగా అభ్యర్థులు నానా ఇబ్బందులకు లోనవుతూ కోర్టును ఆశ్రయించాల్సివస్తోంది. ఇలా వందల సంఖ్యలో కోర్టులో కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గత మార్చిలో యాజమాన్యం సుమారు 250 ఇంటర్నల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో 11 వెల్ఫేర్ ఆఫీసర్ ట్రెయినీ గ్రేడ్-1(ఇంటర్నల్) పోస్టులకు గత నెల 21న పరీక్ష నిర్వహించారు. అయితే, నోటిఫికేషన్‌లో పురుషులు మాత్రమే అనే అంశాన్ని పొందుపర్చకపోవడంతో మహిళలు కూడా దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే పరిశీలన సమయంలో పక్కన పెట్టాల్సి ఉంది. అలా కూడా చేయకుండా యాజమాన్యం హాల్‌టికెట్లు జారీ చేసింది. ఆ తర్వాత మెరిట్ సాధించిన వారికి పోస్టులు కేటాయించకపోవటంతో అభ్యర్థులు ఇటీవల కోర్టును ఆశ్రయించడంతో మొత్తంగా పోస్టింగ్ ప్రక్రియ నిలిచిపోయింది.

1990లో మహిళలకు అవకాశం

1990 సంవత్సరంలో తొలిసారిగా వెల్ఫేర్ ఆఫీసర్లుగా యాజమాన్యం ముగ్గురు మహిళలను ఎంపికచేసింది. ఇందులో ఒకరు ఉద్యోగ విరమణ చేయగా ఇంకొకరు ఏజీఎంగా, మరొకరు డీజీఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ తర్వాత మాత్రం ఈ పోస్టులకు పురుషులనే ఎంపిక చేస్తున్నారు. ఇటీవల కోలిండియా పరిధిలోని కొన్ని బొగ్గు పరిశ్రమల్లో మహిళ ఉద్యోగులు అండర్‌గ్రౌండ్‌లో ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో పనిచేస్తున్నారు. అలాగే, మహిళలను భూగర్భ గనుల్లో ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటలకు వరకు పని చేయించవచ్చని పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించారు. ఇక రాష్ట్రంలోనూ ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించారు. అయినప్పటికీ ప్రభుత్వ ఆధీనంలోని సింగరేణిలో ఇలాంటి నిబంధనలేమీ అమలుకాకపోవడం గమనార్హం.

గనుల్లోనూ 33శాతంపై జీఓ

బొగ్గు గనుల్లో మహిళలకు ఉద్యోగాలు కల్పించేందుకు కేంద్ర మైనింగ్ విభాగం ఇటీవల జీఓ విడుదల చేసింది. ఈమేరకు కొన్ని ప్రజా సంఘాల ఆందోళనతో సింగరేణి గనుల్లోనూ మహిళలకు 33శాతం ఉద్యోగ అవకాశం కల్పించేలా ఆనాటి రిక్రూట్‌మెంట్ సెల్ అధికారులు ఒక్కసారి అవకాశమిస్తామని భరోసా ఇచ్చారు. కానీ ఆతర్వాత అధికారులు మారడంతో హామీ బుట్టదాఖలైంది.

పరీక్ష రాసేందుకు సైతం కోర్టును..

గత నెల 21న జరిగిన వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించిన రాత పరీక్షకు ఎంబీఏ హెచ్‌ఆర్‌ఎం అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేయలేదు. దీంతో ఆ అర్హత ఉన్న అభ్యర్థులు 117 మంది కోర్టును ఆశ్రయించగా హాల్‌టికెట్లు ఇచ్చి పరీక్ష రాసేందుకు అనుమతించాలని ఆదేశించింది. చివరకు వారిని పరీక్షకు అనుమతించాల్సి వచ్చింది. ఇలా ప్రతీ నోటిఫికేషన్ రకరకాల నిబంధనలతో సింగరేణి వ్యవహరిస్తుండడంతో అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు.

నేడు సింగరేణి వ్యాప్తంగా వేడుకలు

రూ.3.5 కోట్లు కేటాయించిన యాజమాన్యం


కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మూడు రోజులుగా ఉన్న టెంట్లు, కుర్చీలు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సింగరేణి వ్యాప్తంగా సోమవారం వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకోసం యజమాన్యం రూ.3.5 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కాగా, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపించారు. కాగా, ఆవిర్భావ వేడుకలను అన్ని శాఖల ఆధ్వర్యాన నిర్వహిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. కానీ, సింగరేణి సంస్థకు తొమ్మిదేళ్ల కాలంలో ఏరోజు రూపాయి కేటాయించిన దాఖలాలు లేకపోగా దశాబ్ది వేడుకలకు యాజమాన్యమే నిధులు కేటాయించడం గమనార్హం. ఇక రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఈ నెల 2న కొత్తగూడెం ప్రకాశం స్టేడియం, సింగరేణి ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. మళ్లీ 5వ తేదీన సోమవారం వేడుకలు నిర్వహించాల్సి ఉండడంతో ఆరోజు వేసిన షామియానాలు, టెంట్లు, కుర్చీలు ఇప్పటివరకు తీయకపోవడంతో నిధులు వృథా అయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి.

అమరవీరుల స్తూపాలేవి?

తెలంగాణ ఉద్యమంలో భాగంగా ప్రాణాలర్పించిన వారిలో సింగరేణి కార్మికులు కూడా ఉన్నారు. అయితే, రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావొస్తున్నా సింగరేణి వ్యాప్తంగా ఏ ఏరియాల్లో కానీ కార్పొరేట్ కార్యాలయంలో కానీ అమరవీరుల స్తూపం నిర్మించకపోవడాన్ని కార్మికులు తప్పుపడుతున్నారు.

లక్ష గొంతుల రణ నినాదమే 'ప్రజాగర్జన'


సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కూనంనేని, నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే అజెండాగా ఈ నెల 11న నిర్వహిస్తున్న ప్రజాగర్జన బహిరంగ సభ లక్ష గొంతుల రణ నినాదమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. పాలకులు ప్రజాసమస్యల పరిష్కారంపై స్పందించపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 11న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరగనున్న ప్రజాగర్జన సభ వాల్ పోస్టర్లను ఆదివారం ఆయన చుంచుపల్లి మండలం గౌతంపూర్‌లో ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని రుద్రంపూర్, గౌతంపూర్, పెనుబల్లి, పెనగడప తదితర ప్రాంతాల్లో సభకు తరలిరావాలని కోరుతూ ప్రచారం చేస్తూ సాంబశివరావు మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, పోడు సాగుదారులకు పట్టాలివ్వాలనే డిమాండ్‌తో సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చంద్రబాబు ఢిల్లీ టూర్ పెద్ద డ్రామా

- దేశంలో కాంగ్రెస్ నాలుగు సీట్లు గెలిచే పరిస్థితి లేదు
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్


మాట్లాడుతున్న కేఏ పాల్

ఖమ్మంమామిళ్లగూడెం: ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ టూర్ పెద్ద డ్రామా అని.. గత ఐదేళ్లలో తనను కలిసేందుకు చంద్రబాబుకు అమిత్‌షా అనుమతి ఇవ్వలేనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. ఖమ్మం కస్బాబజార్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించాక మాట్లాడారు. దివంగత సీఎం ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చనిపోవటానికి చంద్రబాబు కారణమయ్యాడని విమర్శించారు. చంద్రబాబు ఎక్కడికి వెళ్తే అక్కడ మృత్యుఘోష ఎదురవుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ జాగ్రత్తగా ఉండాలని తాను సలహా ఇస్తున్నట్లు తెలిపారు. ఇక దేశంలో కాంగ్రెస్ నాలుగు సీట్లు గెలిచే పరిస్థితి లేదని, ఆ పార్టీకి అన్నిచోట్ల బలం తగ్గినందున మరో యాభై ఏళ్లయినా అధికారం దక్కదని స్పష్టం చేశారు. ఇటీవల కర్ణాటకలో మాత్రం క్రైస్తవుల మద్దతుతో కాంగ్రెస్ గెలిచిందన్నారు. కాగా, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ప్రజాశాంతి పార్టీలోకి ఆహ్వానిస్తున్నానని, పార్టీలో ఏ స్థానం కావాలన్నా ఇవ్వడమే కాక పార్టీ అధికారంలోకి వచ్చాక ఉపముఖ్యమంత్రి పదవి ఇస్తానని పాల్ తెలిపారు. ఆయన స్వతంత్రంగా పోటీ చేస్తే బడుగు, బలహీనవర్గాలు ఓట్లు వేయరని గుర్తించి తమ పార్టీలో చేరాలని సూచించారు. తాను ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యాక విదేశాల నుంచి నిధులు తీసుకొచ్చి ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలను అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు.


ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం

కొనసాగుతున్న మహిళా టీ-20 క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఆల్‌ఇండియా మహిళా టీ-20 క్రికెట్ టోర్నీ కొనసాగుతోంది. ఈమేరకు ఆదివారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఘనవిజయం సాధించి ముందంజలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్-ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్ సందర్భంగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఉత్తరప్రదేశ్ జట్టు ఇరవై ఓవర్లలో 20 ఓవర్లలో 17.1 ఓవర్లకు ఆలౌట్ అయి 76 పరుగులు చేసింది. జట్టులో తమియా సింగ్ నాలుగు ఫోర్లతో 28, రుక్సర్ అన్సారీ 18, ఝాన్సీలక్ష్మి 10 పరుగులు చేశారు. ఇక ఏపీ బౌలర్లలో భార్గవి నాలుగు, తనిష్క మూడు, రెష్మా, హర్షవర్ధిని ఒక్కో వికెట్ తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ జట్టు ఓపెనర్లు సునీత, యుహాసిని 11 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేధించారుఅ. దీంతో ఏపీ జట్టు ఒక్క వికెట్ కోల్పోకుండా నెగ్గింది. కాగా, సాయంత్రం వర్షం పడటంతో మిగతా మ్యాచ్‌లు నిలిపివేశామని, నిర్వాహకులు ఎం.డీ.మతిన్ వెల్లడించారు.

రాజద్రోహ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలి

- ఒడిశా రైలు దుర్ఘటనకు మోదీ సర్కార్‌దే బాధ్యత
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

ఖమ్మంమయూరిసెంటర్: రాజద్రోహ చట్టానికి మరింత పదును పెట్టి కఠినశిక్షలు అమలు చేయాలనే లా కమిషన్ చేసిన సిఫారసులు సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ఖమ్మం సుందరయ్యభవనంలో ఆదివారం జరిగిన సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం, ప్రభుత్వ ఆలోచనలతో విభేదించడాన్ని రాజద్రోహంగా పరిగణించడమనే సంప్రదాయం సరికాదన్నారు. లా కమిషన్ చేసిన సిఫారసులు సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలకు పూర్తిగా భిన్నమైనవని తెలిపారు. ఈ నేపథ్యాన రాజద్రోహ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని తమ్మినేని డిమాండ్ చేశారు. కాగా, ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదానికి ప్రధాని మోదీ నైతిక బాధ్యత వహించాలని, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్ద కాలంలో ఇంతటి ఘోర ప్రమాదం జరగకపోగా, రైల్వే శాఖ నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వందల మంది ప్రాణాలను బలిగొందని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, యర్రా శ్రీకాంత్, నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, భారతి, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.